క్లుప్తంగా

శొంఠ్యాంలో ఆసరా వారోత్సవాలు నేడు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో శనివారం ఉదయం ఆసరా మూడో విడత పంపిణీ వారోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో అడపా లవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై, మెగా చెక్‌ను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్



ప్రత్యేక కౌంటర్‌లో చెక్ స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ అప్పలరాజు

మధురవాడ: 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా రెవెన్యూ కలెక్షన్ కోసం చేపడుతున్న చర్యల్లో భాగంగా జీవీఎంసీ మధురవాడ జోనల్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే సౌకర్యం కార్యాలయంలో ఒక కౌంటర్ నడుస్తోంది. దీనితో పాటు జెడ్సీ చాంబర్ పక్కన ఉన్న ఐటీ వింగ్ గదిలో మరో కౌంటర్ ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ అప్పలరాజు చెప్పారు. ఇక్కడ ఆస్తి పన్ను, వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ వంటివి చెల్లించవచ్చన్నారు. కౌంటర్ వద్ద మహిళలు, వృద్ధులకు కుర్చీలు బెంచీలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేశామని చెప్పారు.

ఘనంగా జీవీఎంసీ పాఠశాల వార్షిక వేడుక

తగరపువలస: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని భీమిలి డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు అన్నారు. బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు తరశ్ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించి, ఆన్‌లైన్‌లో మార్కులు పొందుపరచాలని సూచించారు. ఛాత్రోపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాకు 102 ఏళ్లు పూర్తయినందున స్మరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక పాల్గొన్నారు.

పద్మనాభం తహసీల్దార్‌గా శ్రీవల్లీ



పద్మనాభం: పద్మనాభం తహసీల్దార్‌గా తోట శ్రీవల్లీ నియమితులయ్యారు. ఈమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీవల్లీ మంగళగిరి భూపరిపాలన విభాగం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌గా ఇదే మొదటి పోస్టింగ్. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

మహిళల జీవితాల్లో కొత్త వెలుగు



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా సంఘాల మహిళలు

- సీఎం జగన్ పాలనలో అతివలకు 'ఆసరా'
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- లబ్ధిదారులకు మెగా చెక్ పంపిణీ

భీమునిపట్నం: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడ నాలుగు వార్డుల స్వయం సహాయ సంఘాల మహిళలతో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత మూడు సంవత్సరాల్లో 12,857 మంది మహిళలకు రూ 9.70 కోట్ల సాయాన్ని ఇచ్చారని తెలిపారు. మహిళలందరి ఆర్థిక స్థితిగతులు బాగుండాలి, వారి జీవనం సాఫీగా సాగాలన్న ఉద్దేశంతో ఎన్నో విధాలుగా వారికి చేయూత ఇస్తున్నారని అన్నారు. సీఎం జగన్ ప్రచారాల కోసం చంద్రబాబునాయుడులా ప్రజాధనాన్ని ఎక్కడా ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని, ప్రతి పైసా అర్హులైన పేదవారికి అందిస్తున్నారని అన్నారు. ఇలా అన్ని వర్గాల వారు మెచ్చేవిధంగా అద్భుతమైన పాలనను ఇవ్వడంతో ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయన సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఫ్లెక్సీకి మహిళలు క్షీరాభిషేకం చేశారు. మూడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మూడో వార్డు ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జీవీఎంసీ కో–ఆప్షన్ మెంబర్ కొప్పల ప్రభావతి, నాయకులు వాసుపల్లి కొండబాబు, అక్కరమాని రామునాయుడు, కోంద్రు రామసూర్యుడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, వాసుపల్లి ఎల్లాజీరావు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పాల్గొన్నారు.



భీమిలిలో సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



ఆసరా నగదుతో వ్యాపారం పెట్టుకున్న స్వప్నతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

కొమ్మాది: మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలోని మహిళల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఏకైక రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అన్నారు. రుణమాఫీ పేరుతో గతంలో చంద్రబాబు మహిళలను మోసం చేశారని, కానీ నేడు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేస్తోందన్నారు. ఆసరా ద్వారా మహిళలు మనోశక్తితో పాటు ఆర్థిక సాధికారతను సాధిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పేదలకు ఇళ్లు, చేయూత, ఆసరా, అమ్మఒడి, విద్యా దీవెన వంటి ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నాయన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఏ ఒక్క పథకాన్ని ఆపలేదన్నారు. 'నేను విన్నాను, నేను ఉన్నాను' అంటూ పేదలకు భరోసా కల్పించిన రియల్ హీరో జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ. 10 కోట్ల 62 లక్షలు మెగా చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు.

'ఆసరా' సొమ్ముతో స్వయం ఉపాధి

సభకు సమీపంలో స్వప్న అనే మహిళ మూడుసార్లుగా ఆసరాతో వచ్చిన డబ్బుతో ఓ దుకాణం పెట్టుకుని, జీవనోపాధి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి వెళ్లి, ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏ పథకం పొందాలన్నా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, నేడు నేరుగా ఇంటికే వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని.. సంతోషంగా జీవనం సాగుతోందని తెలిపారు. తమకు ఇద్దరు పిల్లలని, వారిలో ఒక అమ్మాయి వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోందని తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, రాష్ట్ర నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, నాయకులు ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, చెన్నా దాసు, నొడగల రాంబాబు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలదిబ్బడపాలెం, ఎస్సీకాలనీ, చిన్నఉప్పాడ ప్రాంతాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే నాయకుడు జగన్ అని, మహిళలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని భావించి, అన్ని రంగాల్లో వారికి విశేష ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తున్న కుట్రలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అందరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తమ దృష్టికి తీసుకుని వచ్చిన పలు సమస్యలను సంబంధిత సచివాలయ సిబ్బందితో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, నాయకులు వాసుపల్లి నల్లబాబు, బోర రామకృష్ణ, మేరుగు చిన్నారావు, మరుపిల్లి చిన్నారావు, రాముల ప్పడు, సాడి రమణ పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు కృషి



రేవిడి వెంకటాపురం చెరువు వద్ద రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

పద్మనాభం: చెరువుల పరిరక్షణే తమ ధ్యేయమని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. మండలంలోని రేవిడిలో యాతవాని చెరువు, నేరేళ్లవలసలో నేరేళ్ల చెరువు, పాట్నూరులో గవరరాజు చెరువులను శుక్రవారం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ యాత చెరువు గర్భానికి రెవెన్యూ అధికారులు 1బీలు జారీ చేశారన్నారు. నేరేళ్ల చెరువు, గవరరాజు చెరువు కబ్జాకు గురైనట్టు చెప్పారు. ల్యాండ్ పూలింగ్‌లో రైతుల నుంచి తీసుకున్న భూములకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, భీమునిపట్నం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా.. మరో వ్యక్తి ప్రమాదవశాత్తు ఆరో అంతస్తు నుంచి కిందకు పడి దుర్మరణం చెందాడు. స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధురవాడ శివశక్తినగర్ శ్రీలక్ష్మీనగర్‌లో నివసిస్తున్న టీటీ మంగరాజు(29) ఆటో డ్రైవరు. భార్య తులసి, రెండేళ్ల కుమారుడితో నివసిస్తున్నాడు. తులసి ఓల్డ్ డెయిరీ ఫారం వద్ద పెట్రోలు బంకులో పని చేస్తోంది. మంగరాజు వ్యసనాలకు బానిసై అప్పులు చేశాడు. ఇటీవల తాగిన మత్తులో పడి పోవడంతో చేతికి గాయాలయ్యాయి. ఇంటి వద్దే ఉంటున్నాడు. భార్యే కుటుంబాన్ని నెట్టుకువస్తోంది. గురువారం సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో భార్యలేని సమయంలో మంగరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య తులసి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ దుర్గారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- వెస్ట్ బెంగాల్ భవానీపూర్ ప్రాంతానికి చెందిన మంగల్ మాల్(24) ఇటీవల నగరానికి వలస వచ్చాడు. స్థానిక ఇండియన్ బుల్స్ సంస్థలో భవన నిర్మాణ కూలీగా పని చేస్తున్నాడు. శుక్రవారం తాను పని చేస్తున్న బహుళ అంతస్తుల భవనానికి వాటరింగ్ చేస్తుండగా కాలికి పైపు అడ్డంగా రావడంతో తన్నుకుని ఆరో అంతస్తు నుంచి జారి పడి కిందకు పడిపోయాడు. క్షతగాత్రుని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్టు డాక్టర్లు తెలిపారు. సహచర కార్మికుడు చిరంజిత్ మాల్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళకు చీరలు అందజేస్తున్న ఎంపీపీ వాసురాజు

తగరపువలస: భీమిలి మండలం పాత మూలకుద్దు రామాలయంలో శుక్రవారం వంద మంది పేద మహిళలకు భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా మధురవాడ వెంకటేశ్వర విద్యాసంస్థల అధినేత వెంకటేష్ అందించిన ఈ చీరలను ఆయనతో కలిసి ఎంపీపీ అందించారు. వాసురాజు మాట్లాడుతూ శ్రీరాముడు చూపిన బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వీఆర్వో కొయ్య అప్పల సూర్యనారాయణరెడ్డి, వ్యాపారవేత్త దువ్వి కిషోర్, ఆలయ కమిటీ ప్రతినిధులు రామునాయుడు, ఆశి రమణ, జీరు మహేష్‌రెడ్డి, కొయ్య మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై తహసీల్దారుకు ఫిర్యాదు

ఆనందపురం : ఆనందపురం ప్రభుత్వ కార్యాలయానికి సమీపంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని నిరోధించాలని తహసీల్దారుకు కొంతమంది శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆనందపురం రెవెన్యూ గ్రామంలోని లొడగలవానిపాలెం వద్ద సర్వే నంబర్లు 276, 205లలో సుమారు ఎకరా ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. అందులో ఎటువంటి అనుమతి లేకుండా పక్కా నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ ఆక్రమణల విషయమై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మొత్తం స్థలం ఆక్రమణలకు గురవుతోందని వివరించారు. ఆక్రమణలపై గతేడాది హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని, అయినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఎంతో విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు కె.హరిబాబు తదితరులు తహశీల్దారు రామారావుకు ఫిర్యాదు సమర్పించారు.

865 మంది టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్లు



ఉపాధ్యాయులతో సెల్ఫీ దిగుతున్న పదో తరగతి విద్యార్థులు

మధురవాడ: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని పలువురు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. శుక్రవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 865 మందికి హాల్ టికెట్లు పంపిణీ చేశారు. దీనికి హాజరైన విజిస్ ఫౌండేషన్ ప్రతినిధి విజయమోహన్, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బి.మీనా తదితరులు మాట్లాడుతూ ఈ ఏడాది మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఫొటోలు తీసుకుని విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ విద్యార్థుల సందడి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవం సంయుక్త–23 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వర్సిటీలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న పలు దేశాల విద్యార్థులు సందడి చేశారు. సంగీత, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నేపాలి నృత్యం, రువండా సంగీతం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పాల్గొన్నారు.

పగిలిన ప్రధాన పైప్‌లైన్



చిన్నబజారు మార్కెట్ పక్క ప్రధాన రోడ్డు కింద పైప్‌లైన్ పగలడంతో వృథాగా పోతున్న నీరు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

భీమునిపట్నం: భీమిలికి గోస్తని నది ద్వారా సరఫరా అవుతున్న మంచినీటి ప్రధాన పైప్‌లైను శుక్రవారం పగిలిపోవడంతో తాగు నీరు పెద్ద ఎత్తున వృథాగా పోయింది. ఇక్కడ చిన్నబజారు మార్కెట్ సమీపంలో తగరపువలసకు వెళ్లే ప్రధాన మార్గం కింద పైపులైన్ ఉంది, ఇది ఒత్తిడికి పగిలిపోవడంతో రోడ్డుకు బీటలు వేసి, నీరు రోడ్డుపైకి వరదలా పారింది. విషయం తెలుసుకున్న నీటి సరఫరా విభాగ సిబ్బంది వెంటనే పొక్లెయిన్‌తో మరమ్మతులు చేపట్టారు. ఈ కారణంగా భీమిలిలో రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండే అవకాశం లేదు. ఇదిలా ఉండగా.. నీటి సరఫరాకు సంబంధించిన పైప్‌లైన్లు నాశిరకానివి కావడంతో తరచూ ఇవి పగిలిపోయి, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన పైపులైన్లు వేసి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ



హాల్ టికెట్లు అందిస్తున్న దివీస్ సామాజిక సేవ అధికారులు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చిప్పాడ పంచాయతీలలోని 50 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులకు దివీస్ లేబొరేటరీ సామాజికసేవా విభాగం అధికారులు శుక్రవారం హాల్ టికెట్లు అందించారు. సంబంధిత అధికారి ఇ.ఎస్.నాగరాజు మాట్లాడుతూ ఈ మూడు పంచాయతీలలో మధ్యలో చదువు మానేసిన వారిని అక్షరాస్యులుగా చేసే కార్యక్రమాన్ని దివీస్ చేపడుతోందని చెప్పారు. ఈ ఏడాది పదో తరగతిలో 13 మందికి, ఇంటర్మీడియట్‌లో 37 మందికి శిక్షణ ఇచ్చి, ఫీజులు చెల్లించి పరీక్షలకు పంపిస్తున్నట్టు తెలిపారు. వీరంతా మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించి, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు తీసుకెళ్లాలి

భీమునిపట్నం: నియోజకవర్గ పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ తన క్యాంపు కార్యాలయంలో మూడు మండలాలకు చెందిన గృహసారథులు, కన్వీనర్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ప్రజల్లోకి సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలన్నారు. భీమిలి నియోజకవర్గాన్ని వైఎస్సార్‌సీపీ కంచుకోటగా మార్చాలని, వచ్చే ఎన్నికల్లో కూడా ఇక్కడ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు పి.బాలరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతానికి ర్యాలీ



చిట్టివలసలో ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహిస్తున్న సిటు నాయకులు

తగరపువలస: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ భీమిలి డివిజన్ సీఐటీయూ నాయకులు శుక్రవారం కార్మికవాడలో ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టారు. డివిజన్ అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్ మూర్తి మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి సబ్సిడీలు అందించాలన్నారు. బడ్జెట్‌లో రైతులకు రూ.3 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ఐద్వా నాయకురాలు కె.నాగరాణి, సిటు నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, శిరువురి శ్రీనివాసవర్మ, ఊళ్ల నాగరాజు, ముద్దాడ రాము, పెంటరాజు, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ బైపీసీలో 40 సీట్లు ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు https//apkgbv.apcfss.in ఆరో తరగతి కోసం, ఇంటర్‌లో ప్రవేశం కోసం https//bit.ly/KGBV&inter వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సుభాష్‌కు జాతీయ స్థాయి అవార్డు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థి ఎస్.సుభాష్ జాతీయ స్థాయిలో బెస్ట్ యూత్ అవార్డు పొందారు. ఇటీవల హరియాణాలో జరిగిన జాతీయ స్థాయి యూత్ రెడ్ క్రాస్ క్యాంప్‌లో 17 దేశాల నుంచి 44 విశ్వవిద్యాలయాలకు చెందిన 187 మంది క్యాడెట్‌లు పాల్గొన్నారు. వారిలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన సుభాష్ జాతీయ స్థాయిలో ఉత్తమ యూత్ అవార్డ్ సాధించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో సుభాష్‌ను అభినందించారు. విద్యార్థి దశ నుంచి సేవా భావం అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ అండ్ హోమ్ ఇంటీరియర్ ఎక్స్‌పోకు ఆదరణ



ఫర్నిచర్ షోను ప్రారంభిస్తున్న నగర మేయర్ హరివెంకటకుమారి, తదితరులు

పీఎం పాలెం: స్థానిక వైజాగ్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఫర్నిచర్ అండ్ హోమ్ ఇంటీరియర్ ఎక్స్‌పోను మేయర్ గొలగాని హరివెంకటకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో అమర్చుకున్న ఫర్నిచర్‌తో ఆ ఇంటికి నిండుతనం వస్తుందన్నారు. ఈ షో ఈ నెల 3వ తేదీ వరకూ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి ప్రవేశ రుసుం చెల్లించనవసరం లేదన్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకూ వినియోగదారులకు ఈ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుందన్నారు. 70 శాతం వరకూ తగ్గింపు ధరలకు ఇక్కడ ప్రదర్శించిన ఫర్నిచర్‌ను సొంతం చేసుకోవచ్చునని చెప్పారు.

బాలల సంక్షేమానికి సమష్టి కృషి అవసరం

ఏయూ క్యాంపస్: చైల్డ్‌లైన్ నోడల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రిసోర్స్ ఆర్గనైజేషన్‌పై జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈలో నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ బాలల సంక్షేమం, భద్రతలో విభిన్న ప్రభుత్వ శాఖలు, ఎన్‌జీవోలు సమష్టిగా పని చేయాలని సూచించారు. బాలల హక్కులను కాపాడం, అమలు చేయడంలో రాజీ పడవద్దన్నారు. వార్డు సచివాలయ సిబ్బందిని భాగస్వాములను చేస్తూ పనిచేస్తే బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టడం సాధ్యపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరి, ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఆర్.పూర్ణిమదేవి, ఎం.ఆర్.ఎల్ రాధిక, ఎల్.ప్రగ్యన్ కుమార్, నోడల్ సమన్వయకర్త జి.సూరిబాబు పాల్గొన్నారు.